# కల్మషాత్మ

కార్పొరేషన్ బిల్డింగ్ మీద వున్న గడియారం నగరం గుండెలపై పన్నెండు గంటలు కొట్టింది. రాళ్ళు బద్దలుచేసే రోహిణీకార్తె. ఎండ నిప్పులు చెరుగుతోంది.

లారీలూ, బస్సూ, సైకిళ్ళ రణగొణ ధ్వనిలో ట్రాఫిక్ డ్యూటీ కానిస్టేబులు యీలలు మునిగిపోతున్నాయి.

లాగుడుబండి 'యానగవని' పలుపు తిరగి వంతెన ఎక్కుతోంది. నాంచారయ్య బండిముందు నుంచొని, కాడి పొత్తికడుపు ఆనించుకొని వంగి లాగుతున్నాడు. వెనకనుంచి నర్సాయి బండి తోస్తోవున్నాడు.

మండే తారురోడ్డుమీద బండి భారంగా సాగిపోతోంది. రోడ్డుమీద తారు కరిగి కాళ్ళకు అంటుకుపోతోంది. చొక్కాలేని వంటిమీద స్వేదబిందువులు కారి మొలకు చుట్టుకొన్న మురికిగుడ్డల్ను తడిపివేస్తోన్నాయి.

ముందువైపున బండి లాగుతోన్న నాంచారయ్యకు జీవితంలో సగభాగం హరించుకుపోయి, వయసూ—వడుపూ వుడిగిపోయి వృద్ధాప్యంలో కాలుపెట్టగా, బండి వెనకనుంచి తోస్తోన్న నర్సాయి బాల్యదశలోనుంచి తొలి యవ్వన దశలోకి వచ్చినవాడు. ఉడుకు రక్తం. పదును వయసులో వున్నా నర్సాయికి బాల్యచాపల్యం వదల్లేదు. నాంచారయ్య దాదాపు యిరవై సంవత్సరాలనాడు యీబండిలాగేవృత్తిలో ప్రవేశించాడు, కాని నర్సాయి యీ పనిలో ప్రవేశించి యింకా యిరవైరోజులైనా కాలేదు

ఇరవై సంవత్సరాలుగా నాంచారయ్య బండిలాగుతో, అరవయ్యోవడిలో - ఎముకల్లో మూలుగు చచ్చి, రక్తంలో జీవం వుడిగి, కాళ్ళల్లో పట్టుతప్పి, చేతుల్లో సత్తువతగ్గి-యినప సామాన్లు వేసి కిరకిర లాడుతోన్న బరువు బండిని ముప్ఫయి అడుగుల ఎత్తు బ్రిడ్జిపైగా, మండే తార్రోడ్డుమీద దేని కోసం, ఏ పరిస్థితుల ప్రోద్బలంవల్ల యింకా లాగుతున్నాడో ఆ పరిస్థితులే, ఆ అవసరాలే, ఆ కారణాలే యింకా కుర్ర తనం వదిలి వదలని వదహారేళ్ళయినా వెళ్ళని నర్సాయిని బరువుబండి వెనక నుంచోని తోయించుతున్నయ్.

నర్సాయి బండిలాగే పనిలో తన ఇష్టమయి చేర లేదు. వాళ్ళమ్మ పోరు పడలేకే చేరాడు. నర్సాయికి కష్ట పడకుండా బతికే మార్గాల్లో కొన్ని తెలుసు. అయితే వాటివల్ల అప్పుడప్పుడూ వళ్ళు హూనంహూనం అవుతుం డేది. ఒకటి రెండు రాత్రుళ్లు పోలీసుస్టేషనులో నిద్రకూడా చేయాల్సి వచ్చేది. పోలీసువాడు లంకించుకున్నప్పుడు మాత్రం ఎలుగ్గొడ్డు చేతుల్లోంచి తప్పించుకోని పులినోటికి తలకాయ అందించినట్టయేది నర్సాయిపని. అయితే వోకో సారి నర్సాయి పని భలే జల్సాగా వుండేది. మంచి ఛాన్సు ఏదైనా దొరికితే రోజుకు రెండు ఎడ్డిపోలో సినిమాలు చూసే వాడు. టార్జాన్ జంగిల్ పిక్చర్లంటే నర్సాయికి భలే యిష్టం. అప్పుడప్పుడూ సినిమాహాల్లో సోడాలు అమ్మ టానికి పోయేవాడు. నల్లబనీను కాకి నిక్కర్లోకిదోపి, తలకు గళ్ళరుమాలు కట్టి చేతులు పోజుగా జేబుల్లో పెట్టి, బీడీ దమ్ము కొట్టూ ఏదోవిన్నపాట విజిలేస్తో, మూర్ మార్కెట్

దగ్గరా, సినిమాహాల్సుముందూ, హోటల్సుముందూ తిరుగు తుంటే వాడ్ని చూడాల్సిందేను. మిలటరీవాళ్లూ, విదేశీయులూ, నావికులూ సిటీలోకొస్తే వాళ్ళెంట తిరుగుతో వాళ్ళతో 'భాష' మాట్లాడుతో, 'గైడ్'చేసి డబ్బులు సంపాదించుకునేవాడు. ఒకోసారి మార్కెట్‌వద్దా, బస్సుస్టాండ్స వద్దా మూటలు మోసి సంపాదించేవాడు.

నర్సాయి తనలాటివాళ్ళతో చేరిన ఏో ముఠాలో వుండేవాడు. తాము చేసే 'పని'లో పోటీపడి నర్సాయి ముఠావాళ్ళు యెదటి ముఠావాళ్ళతో యెదరపడి తన్నుకునే వాళ్ళు. ఒక్కోసారి తమలో తామే తన్నుకొనేవాళ్ళు. అడపా దడపా జనం చేతుల్లోనూ, పోలీసోళ్ళ చేతుల్లోనూ పడి వళ్లు మర్దనం అవుతూండేది నర్సాయికి. అయినా నర్సాయి 'తన పని'లో తను వుంటూ వుండేవాడు. కాని నర్సాయి పని నిలకడైందీ నమ్మకమైందీ కాదు. వచ్చినప్పుడు డబ్బులు అలా వచ్చేవి, లేకపోతే లేదు.

ఒకోసారి నర్సాయి అయ్యా, అమ్మకు నాలుగు మూడు రోజులదాకా పత్తా దొరికేవాడుకాదు. ఒకోసారి మొహం కంది, పక్కటెముకలు వాచి ఇంటికి వచ్చేవాడు, నొప్పులు తగ్గేదాకా ఇల్లు కదిలేవాడుకాదు.

"ఇట్టాంటి పనులు చెయ్యొద్దురా" అని తిట్టితిట్టి నోరు నొప్పిపుట్టి వూరుకొంది అమ్మ. కొట్టికొట్టి చేతులు నొప్పి పెట్టి వూరుకొన్నాడు అయ్య. గాలిగా పెరిగి అల్లరి జీవితానికి అలవాటుపడిన నర్సాయికి, హఠాత్తుగా మనోచికం పోసి తండ్రి చాపనే ముందరికాళ్ళకు బందం పడిన

ట్టయింది. అయ్యే బతికుండగా కష్టపడి నో రూపాయి డబ్బులు తెస్తే వేళకింత గంజి దొరికేది యింట్లో నర్సా యికి. కాని యిప్పుడు తనకి, తల్లికీ గంజి కరువైంది.

సాహసించి నర్సాయి తనకు చేతనయిందీ, అలవా టయిందీ నో పని చేసి చూశాడు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్టయింది నర్సాయి పని. తప్పించుకువచ్చి యింట్లో దాక్కున్నాడు. సాయంకాలానికి యిద్దరు మనుషు లొచ్చి, నర్సాయినీ, అడ్డంవచ్చిన తల్లినీ చావచితక తన్ని పోయారు.

నర్సాయిని పట్టుకొని యేడ్చింది తల్లి. ఇట్టాంటి పనులు చేసి నువ్వు జైలుకుపోతే నా గతేమవుద్దని అడిగింది. నర్సాయి ఆలోచనలో పడి అడిగాడు—

"మరి నన్నేంపని చేయమంటావే ?"

నర్సాయి తల్లి ఆలోచించి చెప్పింది - "నాంచా రయ్యతో మాట్టాడి వస్తాను" అని.

* * *

నాంచారయ్యను బతిమలాడి నర్సాయిని పనిలో ప్రవేశపెట్టింది తల్లి. ఏదో మొగుడుచచ్చిన ముండా, తెలి సిన వాళ్లూ కొంతసహాయంగా వుంటుందని వొప్పుకొన్నాడు నాంచారయ్య. తనకి మనిషి అవసరం వుంది. అంతకుముందు బండికి తోడు వస్తోన్నవాడు మానేసి వేరే పనిలోకి పోయాడు. ఎవరినయ్‌నా తోడు తీసుకోకతప్పదు. ఏదో

పీడ్చి తీసుకుంటే వాళ్ళకొంత సహాయం చేసినట్టు వుంటుంది; తనకూ కొంత కలిసివస్తుంది. పెద్దవాడికి యిచ్చినంత వాటా కుర్రాడికి యివ్వనవసరంలేదు. అది తనకు కలసివస్తుంది. కాకపోతే కొంచెం కష్టం.

అలా అనుకొని నాంచారయ్య నర్సాయిని పనిలోకి తీసుకొన్నాడు నాలుగోభాగం ఇస్తానని. వచ్చిన బాడిగ డబ్బుల్లో ఒకవంతు బండి అద్దె, ఒకవంతు నర్సాయికి, రెండువంతులు తనకూ వచ్చేట్టు ఏర్పాటు చేసుకొన్నాడు నాంచారయ్య.

నర్సాయి రోజూ ముప్పావలాకు తగ్గకుండా, అప్పు డప్పుడూ రూపాయిపావలాదాకా తనవంతు వచ్చినదాన్ని తీసుకొచ్చి తల్లికి యిస్తోవున్నాడు.

కాని నర్సాయికి తను చేసేపనిలో కొంత ఇష్టం ఏర్పడ్డా, ముసలోడిపై అయిష్టం అసంతృప్తి ఏర్పడింది. తనూ ముసలాడితోపాటు కష్టపడి బండి నెట్టూన్నాడు. బండిమీాద బరువులెక్కించడం దించడం తనే ఎక్కువ చేస్తు న్నాడు. కాని తనకేమో ముప్పావలా రూపాయి చేతులో పెట్టి మిగతాది జేబులో వేసుకుంటున్నాడు ముసలాడు. రూపాయి తీసుకెళ్తే ఇద్దరికి కూటికే చాలడంలేదు. బీడీలకు కూడా సరిగా చాలడంలేదు. సినిమాసంగతి సరేసరి! యెన్నాళ్ళయిందో చూసి! 'జంగిల్‌కింగ్' మూడువారాలు ఆడినా తనకు పోవడానికి అణాకానీ దొరకలేదు.

అలా ఆలోచనలోపడి కొట్టుకుపోయేవాడు నర్సాయి బండి తోస్తున్నంతసేపూ. రానురాను ముసలాడిమీాద కసి

పెరిగిపోతోంది నర్సాయికి. తన ఆలోచనలు పెరిగినట్టే ముసలాడు తన్ను అన్యాయం చేస్తున్నాడని మనసులో బాగా నాటుకొంది. ముసలాడిమీద కచ్చ పెరిగినకొద్దీ చేసే పనిలో అశ్రద్ధ, అయిష్టత ఏర్పడినయ్.

బండి నెట్టుతోన్నట్టుగా చేతులానించి, బలంకొద్దీ తోయ్యకుండా నాటకం తొక్కడం మొదలుపెట్టాడు. ముసలాడు లాగలేక ముక్కుతూంటే నర్సాయి తనలో తనే నవ్వుకునేవాడు, ఆనందపడేవాడు. మధ్యమధ్య బండిమీదా, బరువులమీదా పెట్టి ముసలాడ్ని బూతులు తిట్టేవాడు.

బరువుబండి వంతెన ఎక్కేప్పుడు ముసలాడు లాగలేక నురగలు కక్కుతోంటే వెనకనుంచి నర్సాయి నెట్టకుండానే మహాశ్రమపడి నెట్తోన్నట్టు అరుస్తూ పాడుతూ ముసలాడికి హుషారిస్తూండేవాడు.

నాంచారయ్య పగలంతా పడ్డ బాధా, శ్రమా, సాయంకాలం ఒకరూపాయిడబ్బులు ఎక్కువ మిగలడంచూసి మర్చిపోయేవాడు. తనలోని జవం, పటుత్వం తగ్గిపోవడంవల్ల ఒకప్పుడు అవలీలగా లాగినబండి ఇప్పుడింత భారం అవుతుందనుకునేవాడు. కుర్రాడు నర్సాయి పాపం బాగా కష్టపడుతున్నా డనుకునేవాడు మనసులో. ఇంకా వోనెల పోయాకన్నా వాడికూడా సగభాగం ఇస్తేనే బాగుంటుందేమోననుకునేవాడు. కాని యివ్వాలనేసరికి మనసు వొప్పేదికాదు ముసలాడికి.

ముసలాడి శరీరపాటవం నానాటికీ తగ్గిపోతోంది. అప్పుడప్పుడు గుండె కలక వేయటం మొదలుపెట్టింది. అయినా

అతడు తెచ్చి పెట్టుకున్న వోపికతో బండి లాగుతోన్నాడు. నర్సాయి తన నాటకం తను ఆడుతోనే వున్నాడు.

కాలచక్రం దొర్లిపోతోంది. లాగుడు బండిచక్రాలు బ్రిడ్జిమీదగా తారోడ్డుపై దొర్లుతూనే వున్నయ్.

* * *

ఒక రోజున—

బసవులతో బండి 'యానగవని' మలుపుతిరిగి వంతెన ఎక్కుతోంది. నాంచారయ్య పళ్ళు బిగించి నురుగులు కక్కుతూ, చెమటలు కారుస్తో లాగుతోన్నాడు. వెనక నుంచి నర్సాయి బండిమీద వుట్టినే చేతులానించి కేకలేస్తూ వుషారిస్తున్నాడు.

బండి వంతెనమధ్యకు వస్తోండగా, నాంచారయ్య కాళ్ళకింద భూమి తప్పుకున్నట్టయింది. నరాలు విచ్చిపోతోన్నట్టయి బండి పట్టువదలి రోడ్డుమీద బోర్లా పడ్డాడు. వుక్కిళ్ళతో బొళుక్కు బొళుక్కున రక్తం కక్కి ఆ మడుగులో పడిపోయాడు ముసలాడు.

దాటిపోతున్న పదిమంది వచ్చిపడి వెనక్కు జారబోతున్న బండిని ఆపారు. తర్వాత నర్సాయి సహాయంతో ముసలాడ్ని యింటికి చేర్చారు.

నాంచారయ్య చావబోయేముందు పక్కనేవున్న నర్సాయి కళ్ళలోకి జాలిగా చూసి ప్రాణం విడిచాడు. ఆ చూపు నర్సాయి హృదయంలో నాటుకోంది. నర్సాయి హృదయంలో తీరని ఆవేదన, సంక్షోభం కలిగించింది.

ఆనాటినుంచీ నర్సాయి హృదయంలో ముసలాడి కడసారి చూపులు బాకుల్లా గుచ్చుకునేవున్నై.

★ ★ ★

కొన్నేళ్ళ తర్వాత—

కిరకిరలాడుతూ బరువుబండి 'యానగవని' మలుపు తిరిగి వంతెన యెక్కుతోంది. బండ్లు నోడలూ, నోడలు బండ్లూ అవుతై అంటారు. కాని బండ్లు బండ్లుగానేవున్నై! అయితే జరిగిపోయిన పట్టాల బదులు కొత్తపట్టాలువచ్చినై. యిరిగిపోయిన భాగాలకు మరామత్తు జరిగింది. అంతేభేదం. కుర్రాడు నర్సాయి వృద్ధుడు నర్సయ్య అయాడు.

ఈసారి బండి ముందుండి లాగుతోంది నర్సయ్య; వెనకనుంచి నెడుతోంది పదహారేళ్ళయినానిండని పోలాయి.

ఎన్నో యేళ్ళనాడు నాంచారయ్య లాగుతూ లాగుతూ వదిలేసిపోయిన బండినే యీనాడూ లాగుతోన్నాడు నర్సయ్య. నాంచారయ్య దుర్మరణం తాలూకు భయంకర స్మృతులు నర్సయ్య స్మృతిపథంలో యీనాటికీ మెదులుతూనే వున్నాయి. ఆనాటినుంచీ నర్సయ్య బతుకంతా సుదీర్ఘ స్వప్నంలా జరిగిపోతోంది.

అహర్నిశలూ ముసలాడికి తను చేసిన అన్యాయాన్ని తలుచుకొని కుమిలిపోతూ వుండేవాడు. తను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తమేమిటి? తనూ యీ వయసులో బండి లాగుతూ లాగుతూ రక్తం కక్కి చస్తే? తనకు ఆత్మశాంతి దొరుకుతుందేమో? అట్లా చస్తే నాంచారయ్య ఆత్మ తనకు

జరిగిన అన్యాయాన్ని మరిచిపోగలడా ? తన్ను క్షమిస్తుందా? నాంచారయ్య మరో జన్మయెత్తి తను ఆనాడు నాంచారయ్యను చేసినట్టే చేసి తనపై కసితీర్చుకుంటే ఎంత బావుండును ? తన గుండెల్లో దహించుకుపోతూన్న దావాగ్ని అంతకు మినహా ఎలా చల్లారుతుంది !

బండిలాగుతోన్న ముసలివాళ్ళందర్లోనుంచీ నాంచారయ్యే తొంగి చూస్తున్నట్టుగావుండేది నర్సయ్యకు. వాళ్ళందరి కళ్ళల్లోనూ నాంచారయ్య ప్రాణం విడుస్తూ చూసిన చూపే కనపడేది.

వార్థక్యంలో బతుకు తెరువుకోసం బరువుపనులు చేసే వాళ్ళను చూసి నర్సయ్య హృదయం ద్రవించిపోయేది. తన చేతులోవుండే పనికూడా వదిలేసి వాళ్ళకు సహాయపడుతూ వుండేవాడు.

వయసు మిగిలినవాళ్ళు లాగుడుబండి పనికి వచ్చినప్పుడు తన శక్తిమించీ, వళ్ళు దాచుకోకుండా బండి తోశాడు. తన యవ్వనమంతా ఓపికకు మించిన శ్రమ చేయడంలోనే కరిగిపోయింది. నర్సయ్య బండి వెనకున్నాడంటే ముసలాళ్ళకు ప్రాణం లేచివచ్చేది. వళ్ళు అలవకుండా బండి లాగగలిగేవాళ్ళు.

నరసయ్యతోపాటు బండిపనిలోకివచ్చే ముసలివాళ్ళు నరసయ్యను యెంత మెచ్చుకొన్నా అతని హృదయంలోని గాయాన్ని యెవరూ మాన్పలేకపోయారు.

కాలానికి అప్తులు యెవరూ లేరు కాని అప్పుడప్పుడూ పక్షపాతం చూపిస్తుంది.

నరసయ్య మూపుమీద అకాలంగానే వార్ధక్యం వచ్చి కూర్చుంది. వయసులో వున్నప్పుడు శక్తికి మించిన శ్రమా, శ్రమకుదగ్గ పోషణా లేకపోయినదాని ఫలితమే అది.

మనిషి శుష్కించిపోయాడు. చేతులపైనా, కణతలపైనా నరాలు నులకతాళ్ళలా వుబికినై. పక్కటెముకలూ, వెన్నముకా పైకి తేలినై.

నరసయ్య దుఃఖజీవిత శకటం తను లాగుతోన్న బరువు బండిలా కిరకిర లాడుతూ ఎప్పటికప్పుడు విరిగి కుప్పపడే దానిలా సాగిపోతోంది.

తన జీవితం యెలా అంతంకావాలనుకుంటున్నాడో తనకు తెలుసు. యితర పనుల్లోకి పోయే అవకాశం దొరికినా, పోకుండా ఆ బండినే అంటిపెట్టుకొని వున్నాడు.

ఏళ్ళతరబడీ నరసయ్య బండి పట్టుకు లాగినచోట కొయ్యలు అరిగిపోయినయ్. చేతులు కాయలు కాచినయ్, శరీరం కరిగిపోయింది.

ప్రతిరోజూ బండి సంతెనెక్కి, నాంచారయ్య నెత్తురు కక్కిన చోటికి రాగానే నరసయ్య గుండెలు కలకబారేయి. నాంచారయ్య యింకా అక్కడే కూర్చొని నెత్తురు కక్కుతున్నట్టుగా వూహించుకొనేవాడు.

ఏనాడో మరణించిన నాంచారయ్య చితి నరసయ్య హృదయంలో ఆనాటినుంచి రావణాసురుని కాష్ఠంలా రగులుకు పోతూనే వుంది.

కాని వయసుభారం మీద పడ్డకొద్దీ శరీరపటుత్వంతో పాటు గుండె దిటవుకూడా జారిపోయింది. నరసయ్యలో.

తన తీరని బాధా, ఆవేదనా యెవరిమీదో యెందుకో తెలి యని కసిగా, సాధింపుగా మారిపోతోంది.

పోలాయి తల బండి వెనక పట్టెల కానించి నెట్టూ కేకలువేస్తో ముసలి నరసయ్యకు వుషారిస్తోన్నాడు.

అడ్డపై వంగి ఎగశ్వాస దిగశ్వాసతో బండి లాగు తూన్న నరసయ్యకు వెనకనుంచి పోలాయి అంటూన్న పూతపదాలు వుషారుకేకలు వినపడుతోన్నయ్. బండి భారంగా కొండశిలువలా వంతెనమీద పాకుతోంది. నర సయ్య విస్మృతిపథ కవాటాలు తెరుచుకున్నయ్.

ఆనాడు తనేంచేశాడు? నాంచారయ్య లాగలేక మూలుగులోంటే తనెంత వుషారిచ్చి బండి తోయకుండానే ఎంత నాటకం ఆడాడు? కుర్రాళ్ళంతా ముసలాళ్ళని అలాగే చేస్తారేమో? దొంగముండాకొడుకు పోలాయి ఎట్లా అరుస్తోన్నాడో చూడు? వాడు సరిగా నెట్టూంటే తన కింత కష్టంగా ఎందుకు వుంటుంది? సునాయాసంగా ఈడ్చే బండి తన కింత భారం అయిపోతూంటేను?

పోలాయ్ ఎన్ని దొంగవేషాలు వేస్తోన్నాడు? తన్నేనా వాడు మోసం చేయగలిగేది?

నయాగరా ప్రవాహంలా నరసయ్య బుర్రలో ఆలోచనలు సాగినయ్. అతని నాళాల్లో రక్తం కుతకుత లాడింది. నిలువెల్లా కసి పాకులాడింది.

లాగుతోన్న బండిపట్టు సడలించి నామమాత్రంగా పట్టుకొని "ఐలసా! వ్వావ్వా!" అని కేకవేశాడు నరసయ్య.

"అమ్మో!" భయంకరమైన కేక వినిపించింది వెనకనించి.

బండి వొక్కవూపున వెనక్కు గుద్దుకొని నరసయ్య చేతుల్లోంచి కింద పడిపోయింది. బండిమీద సామానులన్నీ దడదడా కింద పడినయ్.

బరువుబండి ఊపుగా వెనక్కు గుద్దుకోడంతో బండికి తల మోటించి బలంగా ముందుకు తోస్తోన్న పోలాయి మెడ పటుక్కున విరిగింది.

నరసయ్య బండివదిలి వెనక్కు వచ్చాడు. పోలాయి రోడ్డుమీద చతికిలపడి వున్నాడు, తలకాయ బుజాలసందున ఇరుక్కుపోయినట్టు మెడ కుంచుకుపోయింది. కుర్రాడు కళ్లు తేలవేస్తున్నాడు. వెన్నెముకవిరిగి మెదడుకు దెబ్బ తగిలింది!

మెలికలు తిరిగిపోతోన్న పోలాయి కంటి పాపలు కొయ్యబారిపోయిన నరసయ్య కళ్ళల్లోకి చూసినయ్.

మరణావస్థలోవున్నకుర్రాడు పోలాయి తనచూపుల్తో నరసయ్య జరాహృదయంలో దించుతోన్న విచ్చుకత్తులు, ఏనాడో తన పసిహృదయంలో వృద్ధుడు నాంచారయ్య దించిపోయిన బాకుల్ని వారుచుకుంటున్న ట్టయింద నరసయ్యకు.